క్లుప్తంగా

సైకిళ్ల పంపిణీ



విద్యార్థినికి సైకిల్‌ను అందజేస్తున్న దృశ్యం

గడివేముల: మండల పరిధిలోని బూజునూరు, బిలకలగూడూరు గ్రామాల విద్యార్థినులకు సైకిళ్లను పంపిణీ చేశారు. శనివారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాలలో సమావేశం నిర్వహించారు. రెండు గ్రామాలకు చెందిన 163 మంది 8వ తరగతి విద్యార్థినులకు జిందాల్ యాజమాన్యం సైకిళ్లను అందజేశారు.

సుంకేసులకు ఇన్ ఫ్లో

గూడూరు: సుంకేసులకు శనివారం 880 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉంది. డ్యాంలో 0.881 టీఎంసీల నీరు నిల్వ ఉంది. కేసీ కాల్వకు 221 క్యూసెక్కుల నీటిని విడుదల చేశారు.

వేతన చట్టం అమలు చేయాలి

పాణ్యం: లోడింగ్, అన్‌లోడింగ్ హమాలీ కార్మికులకు సమగ్ర వేతన చట్టాన్ని అమలు చేయాలని సీఐటీయూ మండల కార్యదర్శి భాస్కర్ కోరారు. శనివారం తమ్మరాజుపల్లె గ్రామంలో కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పొట్ట కూటి కోసం అత్యంత బరువులను ఎత్తి నడివయసుల్లోనే వృద్ధాప్యంలోకి వెళ్తున్నారన్నారు. ఈ వృత్తిని ఎంచుకున్న కార్మికులపై ప్రభుత్వం సమగ్ర వేతన చట్టాన్ని అమలు చేయాలన్నారు. ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యం కల్పించాలని కోరారు. అనంతరం నూతన గ్రామ కమిటీని ఎన్నుకున్నారు.

వర్గీకరణ కోరుతూ పాదయాత్ర

పాణ్యం: ఏబీసీడీ వర్గీకరణ కోరుతూ ఎమ్మార్పీఎస్ నాయకులు పాద యాత్ర చేపట్టారు. సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ పిలుపు మేరకు రాష్ట్ర నాయకుడు గద్దల సామేల్ ఆధ్వర్యంలో మండల కన్వీనర్ బాబు, మండల అధ్యక్షుడు తిమ్మయ్య, నాయకులు సామేల్, సుబ్బయ్య, సుబ్బరాయుడు వెంకటేష్ తదితరులు శనివారం గోనవరం నుంచి పాణ్యం వరకు పాద యాత్ర చేశారు.

77960.54 ఎకరాల్లో సర్వే పూర్తి

కర్నూలు (న్యూటౌన్): మండల పరిధిలో శనివారం నాటికి 77960.54 ఎకరాల్లో భూముల రీ సర్వే పూర్తయిందని రూరల్ ఇన్‌చార్జ్ తహసీల్దార్ శివరాముడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు.

ఆసుపత్రి ఏడీకి సన్మానం



ఏడీ రమేష్‌బాబును సన్మానిస్తున్న అధికారులు

కర్నూలు(హాస్పిటల్): వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ కార్యాలయం డిప్యూటీ డైరెక్టర్‌గా ఎఫ్ఏసీ బాధ్యతలు చేపట్టిన కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాల ఏడీ రమేష్‌బాబును శనివారం ఆసుపత్రి అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి మాట్లాడుతూ ఏడీ రమేష్‌బాబు మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించి, ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సీఎస్ఆర్ఎంవో డాక్టర్ బి.వెంకటేశ్వరరావు, ఆసుపత్రి అడ్మినిస్ట్రేటర్లు డాక్టర్ శివబాలనాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులొస్తే చర్యలు తప్పవు



హాజరు పట్టికను పరిశీలిస్తున్న ఎంపీడీఓ

సి.బెళగల్: ప్రజల నుంచి ఫిర్యాదులొస్తే విచారించి చర్యలు తీసుకుంటామని ఎంపీడీఓ రాముడు సచివాలయ ఉద్యోగులను హెచ్చరించారు. శనివారం ఆయన బ్రాహ్మణదొడ్డి గ్రామ సచివాలయాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ఉద్యోగుల హాజరు, పనితీరుపై తరచూ ఫిర్యాదులొస్తున్నాయని, పద్ధతి మార్చుకోకపోతే శాఖాపరమైన చర్యలుంటాయని హెచ్చరించారు. మధ్యాహ్నం 3 నుంచి 5 గంటల వరకు స్పందన కార్యక్రమం నిర్వహించి ప్రజల సమస్యలపై ఫిర్యాదులు తీసుకోవాలన్నారు. అలాగే త్వరగా ఇళ్ల నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని గృహ లబ్ధిదారులకు సూచించారు.

రైతులతో సమావేశం

కల్లూరు: రబీలో సాగు చేసిన పంటల నమోదు ప్రదర్శన జాబితాపై మండల వ్యవసాయ అధికారి శ్రీనివాసరెడ్డి శనివారం ఎ.గోకులపాడు రైతు భరోసా కేంద్రంలో రైతులతో సమావేశమయ్యారు. పంటల నమోదు ప్రదర్శన జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే తెలియజేయాలని కోరారు. త్వరలోనే సీహెచ్‌సీ ఏర్పాటు చేసి వైఎస్సార్ యంత్ర సేవ పథకం ద్వారా వ్యవసాయ పనిముట్లు, యంత్రాలు అందిస్తామన్నారు.

ముమ్మరంగా పన్ను వసూలు

పన్ను వసూలులో అధికారులు తలమునకలయ్యారు. ఈ నెల చివరితో గడువు ముగియనుండటంతో అంతలోపు పన్ను వసూలు చేసేందుకు తీవ్ర కసరత్తు చేస్తున్నారు. ఇప్పటి వరకు 44.66 శాతం పన్నులు మాత్రమే వసూలు కావడంతో మిగతా 55 శాతం వసూలుపై దృష్టిసారించారు. గడువు సమీపిస్తుండటంతో పన్నులు చెల్లించి తమకు సహకరించాలని పంచాయతీ సిబ్బంది ప్రజలను కోరుతున్నారు. – పాణ్యం

- ఇప్పటి వరకు 44.66 శాతం పూర్తి
- నెలాఖరులోపు పూర్తి చేసేందుకు అధికారుల కసరత్తు
- లక్ష్యం చేరుకున్న ఆలమూరు, గోనవరం, కొండజూటూరు పంచాయతీలు



పాణ్యంలో ఇంటి పన్ను వసూలు చేస్తున్న పంచాయతీ సిబ్బంది

పంచాయతీ పరిధిలోని ఇంటి, కుళాయి, పరిశ్రమల తదితర పన్నుల వసూలుకు అధికారులు, సిబ్బంది నడుంబిగించారు. చిన్న తరహా, పెద్ద పరిశ్రమలు, ప్రభుత్వ, ప్రయివేట్ పాఠశాలలు, కార్యాలయాల పన్ను బకాయిలను వీలైనంత త్వరగా చెల్లించి సహకరించాలని కోరుతున్నారు. ఈనెల చివరి బకాయిలన్నీ వసూలు చేయాలని అధికారుల ఆదేశాల మేరకు గ్రామాల కార్యదర్శులు, వలంటీర్లతోపాటు క్షేత్రస్థాయి సిబ్బంది ఇంటింటికి వెళ్లి పన్ను వసూలు చేస్తున్నారు. మండలంలో 19 పంచాయతీలు ఉన్నాయి. 20222–23 సంవత్సరానికి సంబంధించి రూ.44,96,051 పన్ను వసూలు కావాల్సి ఉండగా ఈనెల 16న నాటికి రూ.20,78,196 వసూలైనట్లు అధికారులు చెబుతున్నారు. కాగా ఆలమూరు, గోనవరం, కొండజూటూరు పంచాయతీలు 100 శాతం పన్ను వసూలు చేసి లక్ష్యాన్ని చేరుకోవడం అధికారులకు ఊరట కలిగించే అంశం.

పంచాయతీల వారీగా పన్ను వసూలు

గ్రామం పేరు	చెల్లించాల్సిన పన్ను	చెల్లించిన పన్ను	బకాయి(రూ.)
ఆలమూరు	71,705	71,705	-
అనుపూరు	28405	25000	3,405
బలపనూరు	2,84,082	76,500	2,07582
భూపనపాడు	1,30278	69,702	60,576
గగ్గటూరు	28,734	6000	22734
గోనవరం	34,987	34,987	-
గోరుకల్లు	1,10,000	80,010	29990
కందికాయపల్లె	30,500	13000	17500
కొండజూటూరు	79,082	79082	-
కొణిదేడు	1,33,000	69000	64000
కౌలూరు	7,96,861	1,61,000	6,35,861
మద్దూరు	67,896	42,596	25,300
నెరవాడ	67,801	57,000	10,801
పాణ్యం	21,39,967	8,96,098	12,43,86
పిన్నాపురం	1,29,333	15,300	1,14,033
ఎస్. కొత్తూరు	69,799	30,100	39699
సుగాలిమెట్ట	88423	52000	36,423
తమ్మరాజుపల్లె	1,25,212	50,600	74,612
తొగర్చేడు	79,986	38,400	41,856
మొత్తం	44,96,051	20,78,196	26,27,971

ఈనెల చివరిలోపు వసూలు చేయాలి

ఈనెల చివరి వరకు పన్ను చెల్లింపునకు గడువు ఉంది. ఇప్పటికే గ్రామాల కార్యదర్శులకు సూచనలిచ్చాం. ప్రతిరోజు ఆయా గ్రామాల క్షేత్రస్థాయి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ ద్వారా పురోగతి తెలుసుకుంటున్నాం. పంచాయతీలో పన్ను చెల్లించిన తర్వాత యజమానులు తప్పకుండా రసీదు తీసుకోవాలి.
– భాస్కర్‌రావు ఈఓఆర్డీ

'పది' పరీక్షలను ప్రశాంతంగా రాయాలి

- సమగ్ర శిక్షా అభియాన్ అదనపు జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ వేణుగోపాల్



డార్మెటరీ బ్లాక్‌ను పరిశీలిస్తున్న వేణుగోపాల్

ఓర్వకల్లు: ఎలాంటి మానసిక ఆందోళనకు గురికాకుండా ప్రశాంతంగా పరీక్షలు రాయాలని సమగ్ర శిక్షా అభియాన్ అదనపు జిల్లా ప్రాజెక్టు కోఆర్డినేటర్ డాక్టర్ వేణుగోపాల్ పదో తరగతి విద్యార్థులకు సూచించారు. శనివారం మండలంలోని కాల్వబుగ్గ బాలుర గురుకుల పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా డాక్టర్ వేణుగోపాల్ పదో తరగతి విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ ఏప్రిల్ 3 నుంచి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమవుతాయన్నారు. ప్రణాళిక ప్రకారం సిలబస్‌ను మరోసారి రివిజన్ చేసుకుని నిర్భయంగా పరీక్షలు రాయాలన్నారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించేందుకు కృషి చేయాచాలని సూచించారు. అనంతరం నూతనంగా నిర్మించిన డార్మెటరీ బ్లాక్‌ను పరిశీలించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మాలిక్‌బాషా, ఏఈ విష్ణువర్ధన్, కాంట్రాక్టర్ జీకే వెంగన్న, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇళ్ల నిర్మాణాలు త్వరగా పూర్తి చేసుకోవాలి



ఇంటి నిర్మాణాన్ని పరిశీలిస్తున్న హౌసింగ్ డీఈఈ వాసుదేవరావు

కోడుమూరు రూరల్: ఇళ్ల నిర్మాణాలను లబ్ధిదారులు త్వరితగతిన పూర్తి చేసుకోవాలని హౌసింగ్ డీఈఈ వాసుదేవరావు సూచించారు. ప్యాలకుర్తిలో శనివారం గృహ నిర్మాణాలను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈఈ మాట్లాడుతూ గృహ నిర్మాణాలకు అవసరమైన సిమెంట్, ఇసుక, స్టీల్ తదితర సామగ్రి అందిస్తున్నామని, కాలనీలో విద్యుత్, నీటి సౌకర్యాన్ని కల్పిస్తున్నామని, ఇంటి నిర్మాణ దశలకు సంబంధించిన బిల్లులు కూడా మంజూరు చేస్తున్నామని వీలైనంత త్వరగా నిర్మాణాలు పూర్తి చేసుకోవాలని సూచించారు. ఆయన వెంట ఎంపీడీఓ చంద్రశేఖర్, ఈఓఆర్డీ మంజుల, ఏపీఓ రమాదేవి ఉన్నారు.

ఉద్యాన పంటల సాగుతో ఆదాయం

కర్నూలు (న్యూటౌన్): ఉద్యాన పంటల సాగుతో రైతులు అధిక లాభాలు పొందవచ్చని ఇన్‌చార్జ్ ఎంపీడీఓ ఎస్ భాస్కర్ నాయుడు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. నిమ్మ, చీని, సపోట, డ్రాగన్‌ఫ్రూట్, మల్లెపూలు, రోజా పూలు తదితర ఉద్యాన పంటల సాగుకు ఐదు ఎకరాల్లోపు సన్న, చిన్న కారు రైతులు అర్హులన్నారు. ఈ పంటల సాగుకు ప్రభుత్వం సబ్సిడీ ఇస్తుందని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోకోవాలన్నారు. అర్హులందరూ తమ పొలానికి సంబంధించి పట్టాదారు పాసుపుస్తకం, ఆన్‌లైన్ అడంగల్ కాపీలతో ఈ నెల 29వ తేదీలోపు తమ దరఖాస్తులను ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలన్నారు.

వ్యాధి నిరోధక టీకాలు తప్పనిసరి

- డీఐఓ డాక్టర్ ప్రవీణ్ కుమార్



టీకా మందులను పరిశీలిస్తున్న డాక్టర్ ప్రవీణ్ కుమార్

ఓర్వకల్లు: గర్భిణులకు, చిన్నారులకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలు వేయాలని జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి(డీఐఓ) డాక్టర్ ప్రవీణ్ కుమార్ సూచించారు. శనివారం మండలంలోని కాల్వబుగ్గలో చిన్నారులకు వేస్తున్న వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ టీకాల వల్ల గర్భిణులు, చిన్న పిల్లల్లో వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందన్నారు. టీకా వేసిన బాధితుల వివరాలను మాతా శిశు సంరక్షణ కార్డులో నమోదు చేసి, ఎప్పటికప్పుడు ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలన్నారు. పిల్లల ఆరోగ్యం పట్ల తల్లిదండ్రులు ప్రత్యేక దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో ఎంపీహెచ్ఓ రాబర్ట్, సీహెచ్ఓ బాల నరసయ్య తదితరులు పాల్గొన్నారు.

భూములను బీళ్లుగా ఉంచొద్దు



విత్తన గుళికలను తయారు చేస్తున్న డీపీఎం నరేంద్రారెడ్డి

పాణ్యం: దిగుబడులు చేతికొచ్చాక పొలాలను బీళ్లుగా ఉంచకుండా నవ ధాన్యాలలో ఏదో ఒకటి సాగు చేయాలని ప్రకృతి సేద్యం డీపీఎం నరేంద్రారెడ్డి రైతులకు సూచించారు. శనివారం స్థానిక పొదుపు భవనంలో రైతులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నవధాన్యాలు సాగు చేయడం వల్ల పొలాల్లో నత్రజని శాతం పెరిగి భూమి సారవంతమవుతుందన్నారు. అనంతరం విత్తన గుళికలను తయారు చేసుకునే పద్ధతిపై అవగాహన కల్పించారు. సమావేశంలో డీపీఎం సలాం తదితరులు పాల్గొన్నారు.

సర్వే త్వరగా పూర్తి చేయాలి



భూములను పరిశీలిస్తున్న ఆర్డీఓ శ్రీనివాసులు

పాణ్యం: మండలంలోని కందికాయపల్లె గ్రామంలో గ్రీన్‌కో సోలార్ పరిశ్రమకు కేటాయించిన భూములకు సంబంధించి సర్వే వేగవంతం చేయాలని నంద్యాల ఆర్డీఓ శ్రీనివాసు లు సూచించారు. శనివారం ఆయన భూముల సర్వేను పరిశీలించారు. ఇప్పటి వరకు చేసిన సర్వే వివరాలపై ఆరా తీశారు. గ్రీన్‌కో తీసుకుంటున్న భూములపై మ్యాపింగ్ ద్వారా అడిగి తెలుసుకున్నారు. నిర్ణీత గడువులోగా సర్వే పూర్తి చేయాలన్నారు. అలాగే సుగాలి మెట్ట సమీపంలో రవాణ శాఖ శిక్షణ కేంద్రానికి కేటాయించిన 5 ఎకరాలు భూమిని పరిశీలించారు. అనంతరం గురుకుల పాఠశాలను సందర్శించి ఇటీవల విద్యార్థినులు అస్వస్థతకు గురికావడానికి గల కారణాలను అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట తహసీల్దార్ మల్లికార్జునరెడ్డి, సర్వేయర్ నాగప్రసాద్ ఉన్నారు.

ప్రగతి బాటలో కర్నూలు నగరం

- రూ.506 కోట్లతో అభివృద్ధి పనులు
- మేయర్ బీవై రామయ్య వెల్లడి



పాలకవర్గం ఏర్పడి రెండేళ్లు పూర్తయిన సందర్భంగా కేక్ కట్ చేస్తున్న మేయర్, డిప్యూటీ మేయర్, కార్పొరేటర్లు

కర్నూలు (టౌన్): అధికారంలోకి వచ్చి రెండేళ్ల వ్యవధిలోనే కర్నూలు నగరపాలక సంస్థ పరిధిలోని కర్నూలు, పాణ్యం, కోడుమూరు అర్బన్ ప్రాంతాల్లో రూ.506 కోట్లతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు నగర మేయర్ బీవై రామయ్య తెలిపారు. శనివారం నగరపాలక సంస్థలో పాలకవర్గం వచ్చి రెండేళ్లు పూర్తి అయిన సందర్భంగా కార్యాలయంలోని కౌన్సి ల్ హాలులో ద్వితీయ వార్షికోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. మేయర్, డిప్యూటీ మేయర్ సిద్ధారెడ్డి రేణుకా, స్టాండింగ్ కమిటీ సభ్యులు, కార్పొరేటర్లు, కోఆప్షన్ సభ్యులు కలిసి కేక్ కట్ చేశారు. అనంతరం మేయర్ మాట్లాడుతూ.. జిల్లా ఇన్‌చార్జ్ మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, పార్లమెంటు సభ్యులు పోచా బ్రహ్మానందరెడ్డి, డాక్టర్ సంజీవ్‌కుమార్, ఎమ్మెల్యేలు హాఫీజ్‌ఖాన్, కాటసాని రాంభూపాల్‌రెడ్డి, జరదొడ్డి సుధాకర్‌ల సహకారంతో నగరాన్ని ప్రగతి బాటలో నడిపిస్తున్నట్లు వెల్లడించారు. ఈ రెండేళ్లలో అందరి సహకారంతో కర్నూలు నగర పరిధిలో కోట్ల రూపాయలు వెచ్చించి రోడ్లు, డ్రైనేజీ, తాగునీటి ప్రాజెక్టులు, నూతనంగా భవనాలు, పార్కుల అభివృద్ధి, వీధిదీపాలు, సుందరీకరణ పనులు పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు చెప్పా రు. ఇప్పటికే ఎన్నో అభివృద్ధి పనులు ప్రారంభించామని, మిగతా పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. అంతేగాక నగరపాలకకు ఆదాయం పెంచే దిశగా ఎన్నో చర్యలు, సంస్కరణలు తీసుకువచ్చామన్నారు. పరిశుభ్రతలో చేపట్టిన వివిధ వినూత్న కార్యక్రమాలు, సంస్కరణలతో కర్నూలు స్వచ్ఛ సర్వేక్షన్‌లో జాతీయ స్థాయిలో 197వ ర్యాంకు నుంచి మొదటి ఏడాది 70వ ర్యాంకు, రెండవ ఏడాది 55వ ర్యాంకు సాధించిందని, రాష్ట్ర స్థాయిలో 4వ ర్యాంకులో నగరాన్ని నిలబెట్టామన్నారు. నగరంలో తాగునీటి సమస్యను శాశ్వతంగా పరిష్కరించేందుకు రూ.80 కోట్లతో సుంకేసుల నుంచి మునగాలపాడు వరకు పైపులైన్ పనులు జరుగుతున్నాయన్నారు. త్వరలోనే రూ.26 కోట్లతో నూతన నగరపాలక సంస్థ కార్యాలయాన్ని నిర్మిస్తున్నట్లు తెలిపారు. వచ్చే మూడేళ్లలో రాష్ట్రంలోనే కర్నూలు నగరం అన్ని రంగాల్లో అగ్రస్థానంలో నిలుపుతామని చెప్పారు.

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

గూడూరు: పట్టణంలోని పడమర బీసీ కాలనీలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడనుందని విద్యుత్ ఏఈ శ్రీనివాస నాయక్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 33 కేవీ లైన్ షిఫ్టింగ్ పనుల నేపథ్యంలో ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని, వినియోగదారులు ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసుకుని సహకరించాలని కోరారు.

ఆరుగురికి గాయాలు

కోడుమూరు రూరల్: మండల పరిధిలోని కొత్తూరు వద్ద శనివారం బైక్‌ను తుఫాన్ వాహనం ఢీకొట్టడంతో ఐదుగురు కర్ణాటక వాసులు స్వల్ప గాయాలపాలయ్యారు. కొత్తూరుకు చెందిన రామకృష్ణ బైక్‌పై పాలు విక్రయించి తిరిగి ఇంటికి వస్తుండగా శ్రీశైలం వెళ్తున్న తుఫాన్ వాహనం ప్రమాదవశాత్తూ ఢీకొంది. ప్రమాదంలో రామకృష్ణకు తీవ్ర గాయాలు కాగా తుఫాన్‌లో ఉన్న ఐదుగురుకి స్వల్ప గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం స్థానికులు ఆసుపత్రికి తరలించారు.

పెంచికలపాడు సమీపంలో..

గూడూరు రూరల్: పెంచికలపాడు విశ్వభారతి జనరల్ ఆసుపత్రి సమీపంలో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు గాయపడ్డారు. కర్నూలు నుంచి కోడుమూరు వైపు వెళ్తున్న కారు అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టును ఢీ కొట్టింది. కారులో ప్రయాణిస్తున్న ముగ్గురు వ్యక్తులు గాయాలపాలయ్యారు. స్థానిక ఆసుపత్రిలో చికిత్స చేయించుకుని వెళ్లిపోయారని, ఆసుపత్రి వద్ద జరిగిన ప్రమాదంపై విచారించగా బాధితుల వివరాలు తెలియలేదని ఎస్ఐ సోమ్లానాయక్ తెలిపారు.

కోలుకోలేక వ్యక్తి మృతి

పాణ్యం: రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్సపొందుతున్న ఓ వ్యక్తి కోలుకోలేక శనివారం మృతి చెందాడు. హెడ్‌కానిస్టేబుల్ మధుసూదన్ తెలిపిన వివరాలు.. నంద్యాల పట్టణం నందమూరి నగర్‌కు చెందిన కృష్ణగౌడ్(50) ఈ నెల 17న బంధువులతో కలిసి ఆటోలో కర్నూలుకు బయలుదేరాడు. మండల పరిధిలోని కౌలూరు మెట్టకు చేరుకోగానే జాతీయ రహదారిపై ముందు వెళ్తున్న కారు ఎడమ వైపు రావడంతో దాన్ని తప్పించే క్రమంలో ఆటో డ్రైవర్ సడన్ బ్రేక్ వేయగా ఆటో బోల్తా పడింది. ప్రమాదంలో ఐదుగురు గాయపడగా శాంతిరాం ఆసుపత్రికి తరలించారు. అక్కడ కోలుకోలేక కృష్ణ మృతి చెందాడు. మృతుడికి భార్య కృష్ణవేణి, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. చిన్న కుమారుడు సురేంద్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

అధికారులకు నోటీసులు

సి.బెళగల్: మండల సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులకు మండల పరిషత్ కార్యాలయ నిర్వహణ అధికారులు శనివారం నోటీసులు జారీ చేశారు. ఈనెల 15న మండల సర్వసభ్యసమావేశం జరిగింది. మండల అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యలు, సమస్యలపై చర్చించాల్సి ఉండగా వైద్య ఆరోగ్యం, సాంఘిక సంక్షేమం, ఆర్‌డబ్ల్యూఎస్, విద్యుత్, ఆర్అండ్‌బీ, ఎక్సైజ్ శాఖల అధికారులు గైర్హాజరయ్యారు. మూడు రోజుల్లో సంజాయిషీ ఇవ్వాలని కోరుతూ మండల పరిషత్ కార్యాలయ నిర్వాహణ అధికారి పుల్లయ్య నోటీసులు జారీ చేశారు.

డ్రిప్ పైపులు దగ్ధం

గూడూరు రూరల్: మండల పరిధిలోని చనుగొండ్లలో విద్యుత్‌తీగ తెగిపడటంతో రైతు దొల పొలంలోని డ్రిప్ పైపులు దగ్ధమయ్యాయి. ఉదయం పొలంలో పని చేసుకుంటుండగా విద్యుత్ స్తంభం నుంచి మెయిన్ వైరు తెగి పొలంలోని గడ్డిపై పడింది. దీంతో మంటలు అంటుకుని గడ్డితో పాటు డ్రిప్ పైపులు కాలిపోయాయి. దాదాపు రూ.20 వేలకు పైగా నష్టం వాటిల్లిందని రైతు దొల తెలిపారు.

మిశ్రమ పంటల సాగుతో అధిక దిగుబడులు

కోడుమూరు రూరల్: మిశ్రమ పంటల సాగుతో అధిక దిగుబడులు పొందవచ్చని వ్యవసాయ అధికారి రవిప్రకాష్ సూచించారు. గోరంట్ల, ముడుమలగుర్తిలోని ఆర్‌బీకేలను శనివారం ఆయన తనిఖీ చేసి పంటల సాగుపై రైతులకు అవగాహన కల్పించారు. ఏటా పత్తి, వేరుశనగ వేస్తుండటంతో తెగుళ్లు, పురుగుల వ్యాప్తికి దిగుబడులు సరిగా రాక నష్టపోతున్నారని, పంట మార్పిడి చేసి చూడాలని సూచించారు. అలాగే నష్టాన్ని తగ్గించుకునేందుకు మిశ్రమ పంటలు సాగు చేసుకోవాలన్నారు. లూజు పత్తి విత్తనాలు కొనుగోలు చేయొద్దని, ఎవరైనా విక్రయిస్తే తమకు సమాచారం ఇస్తే చర్యలు తీసుకుంటామని చెప్పారు.

రోగ నిర్ధారణ.. ఇక సులభం

- పెద్దాసుపత్రిలో వ్యాధులన్నింటికీ ఒకే చోట పరీక్షలు
- అన్ని హంగులతో రూపుదిద్దుకున్న భవనం
- త్వరలో ప్రారంభానికి ఏర్పాట్లు



నూతన డయాగ్నోస్టిక్ బ్లాక్

కర్నూలు(హాస్పిటల్): ఆదోనికి చెందిన రామస్వామి కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలోని మెడికల్ వార్డులో తనకున్న వ్యాధికి చికిత్స చేయించుకునేందుకు వచ్చాడు. అక్కడున్న ఓ డాక్టర్ అతనికి పలు రకాల వ్యాధినిర్ధారణ పరీక్షలు రాసి చేయించుకుని రావాలని సూచించాడు. డాక్టర్ రాసిన చీటీలు పట్టుకుని వ్యాధినిర్ధారణ పరీక్షా కేంద్రాలను వెతుక్కుంటూ అక్కడికి వెళ్లి పరీక్షలు చేయించుకుని, మళ్లీ రిపోర్ట్‌లు తీసుకునేసరికి రెండు గంటలు పైగానే పట్టింది. ఈ లోగా ఓపీలో వైద్యులు వెళ్లిపోయారు. దీంతో చేసేదేమీ లేక రామస్వామి చేతులు ఊపుకుంటూ వెళ్లిపోయారు. ఈ సమస్య రామస్వామి ఒక్కడిదే కాదు పెద్దాసుపత్రికి వచ్చే చాలా మంది ఇలాగే ఇబ్బంది పడుతున్నారు. ఆసుపత్రిలోనే విధులు నిర్వహించే వారు సైతం ఇప్పటికీ ఏ పరీక్ష ఎక్కడ చేస్తారో ఠక్కున చెప్పలేని పరిస్థితి. అలాంటిది అక్షరజ్ఞానం లేని వారు ఆసుపత్రికి వస్తే వారి పరిస్థితి ఎలాగుంటుందో అర్థం చేసుకోవచ్చు. ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ఆసుపత్రిలో వ్యాధులన్నింటికీ ఒకే చోట నిర్ధారణ పరీక్షలు చేసేలా నూతన భవనం (న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్) ఏర్పాటు చేసింది. దీంతో రోగులకు వ్యాధి నిర్ధారణ సులభంగా మారనుంది.

రోజూ వేలాది మంది వచ్చే కర్నూలు ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో కొత్త వ్యాధినిర్ధారణ పరీక్ష కేంద్రం (న్యూ డయాగ్నోస్టిక్ బ్లాక్) నిర్మాణం పూర్తయ్యింది. త్వరగా దీనిని ప్రారంభించేందుకు ఏపీఎంఎస్ఐడీసీ అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. ప్రస్తుతం అల్ట్రాసౌండ్ పరీక్ష కేంద్రం, ఎక్స్‌రే కేంద్రాలు, 24 ల్యాబ్ వద్ద గుంపులు గుంపులుగా జనం గుమిగూడి ఉంటున్నారు. కొన్నిసార్లు ఒకరినొకరు తోసుకుంటూ రిపోర్ట్‌లు, పరీక్షలు చేయించుకోవాల్సిన పరిస్థితి. ఇకపై రోగులకు ఇలాంటి ఇబ్బంది ఉండదు. కొత్త భవనంలో సువిశాల భవనంలో రోగులు, వారి సహాయకులకు కూర్చోవడానికి అనువైన వసతులు, సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. నాలుగు అంతస్తుల్లో ఒక్కో దాంట్లో ఒక్కో వ్యాధినిర్ధారణ పరీక్ష కేంద్రాలు రానున్నాయి. ఇందులో ఎంఆర్ఐ, సీటీస్కాన్, అన్ని రకాల రక్త, మల, మూత్ర పరీక్షలు, ఎక్స్‌రే, అల్ట్రాసౌండ్, ఇతర స్కానింగ్ పరీక్షలు ఒకేచోట ఉండనున్నాయి. పాణ్యం, కర్నూలు ఎమ్మెల్యేలు కాటసాని రాంభూపాల్‌రెడ్డి, హాఫీజ్‌ఖాన్‌లు దీని నిర్మాణం పూర్తి చేసేందుకు విశేషంగా కృషి చేశారు.

ఆధునిక బ్లడ్‌బ్యాంక్ కూడా!

నూతన డయాగ్నోస్టిక్ బ్లాక్‌లోనే ఆధునిక బ్లడ్‌బ్యాంక్ కూడా ఏర్పాటు కానుంది. ప్రస్తుతం ఓపీ భవనంలో రక్తనిధి ఉంది. దీనిని నూతన భవనానికి మార్చి కార్పొరేట్ హంగులతో తీర్చిదిద్దనున్నారు. ఆసుపత్రిలో ఉన్న ఈ బ్లడ్‌బ్యాంక్‌లో కార్పొరేట్ బ్లడ్‌బ్యాంకులకు ఏ మాత్రం తీసిపోని పరికరాలున్నాయి. కానీ రోగులు, వారి సహాయకులు కూర్చునేందుకు అనువైన సౌకర్యాలు లేవు. నూతన భవనంలో నిబంధనలకు అనుగుణంగా అన్ని వసతి, సౌకర్యాలు ఏర్పాటు చేయనున్నారు.

త్వరలో నూతన భవనంలోకి..



ఆసుపత్రిలో కొత్త డయాగ్నోస్టిక్ బ్లాక్ ప్రారంభానికి సిద్ధం అయ్యింది. ఇక విశాలమైన వెయిటింగ్ రూమ్‌లు, సకల సౌకర్యాలతో ఉన్న కాంప్లెక్స్ వల్ల రాయలసీమ ప్రజలకు మరిన్ని సేవలు అందుబాటులోకి వస్తాయి. అన్ని పరీక్షలు ఒకేచోట చేయడం వల్ల రోగులు, వారి సహాయకులకు అటు ఇటూ తిరిగే ప్రయాస, సమయం తగ్గుతాయి. మరో వారం, పదిరోజుల్లో దీనిని ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నాం.
–డాక్టర్ జి. నరేంద్రనాథ్‌రెడ్డి, సూపరింటెండెంట్, జీజీహెచ్, కర్నూలు

చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి



బాస్కెట్ బాల్ పోటీలో తలపడుతున్న బాలికలు

కర్నూలు (టౌన్): విద్యార్థినులు చదువుతో పాటు క్రీడల్లోనూ రాణిస్తే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ సీఈఓ రమణ అన్నారు. శనివారం స్థానిక స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో అంతర్జాతీయ మహిళాదినోత్సం పురస్కరించుకొని మహిళలకు బాస్కెట్ బాల్ పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా సీఈఓ మాట్లాడుతూ స్పోర్ట్స్ అథారిటీ స్టేడియం ఆధ్వర్యంలో గత 8 రోజులుగా మహిళలకు క్రీడా పోటీలతో పాటు ఆరోగ్యం, పోషకాహారంపై నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాలకు మంచి స్పందన వస్తుందన్నారు. కార్యక్రమంలో జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ చీఫ్ కోచ్ నటరాజరావు, సిబ్బంది పాల్గొన్నారు.

19,20 తేదీల్లో పోటీలు

ఈ నెల 19వ తేదీ స్థానిక సిల్వర్ జూబ్లీ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో స్కిప్పింగ్ రోప్, తొక్కుడు బిళ్ల, లెమన్ స్పూన్, 20వ తేదీ గోనెసంచులతో పరుగు పందెం, సూదిదారం, త్రోబాల్, మ్యూజికల్ చైర్స్ వంటి క్రీడాంశాల్లో పోటీలు నిర్వహిస్తున్నట్లు సీఈఓ రమణ వెల్లడించారు. ఆసక్తి కలిగిన యువతులు, మహిళలు పాల్గొనాలన్నారు.